క్లుప్తంగా

మండల సమావేశం రేపు

బాడంగి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 27న ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన జరగనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ మహేశ్వరరావు బుధవారం తెలిపారు. సమావేశానికి సభ్యులతో పాటు అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ఆర్‌పీఎఫ్‌తో కలసి పని చేయండి



బొబ్బిలి రైల్వే ఔట్‌పోస్టు పోలీసులతో మాట్లాడుతున్న రైల్వే ఇన్‌స్పెక్టర్

బొబ్బిలి: రైళ్లలో దొంగతనాలు, గంజాయి రవాణా, అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి ఆర్‌పీఎఫ్‌తో కలిసి పని చేయాలని విశాఖ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక రైల్వే ఔట్‌పోస్టును సందర్శించారు. ఈ సందర్భంగా రైల్వే పోలీసులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. స్థానిక రైల్వే పోలీసులు ఉన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

బాడంగి: విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కారాదని బొబ్బిలి సీఐ నారాయణరావు హితవు పలికారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో హెచ్‌ఎం.సత్యనారాయణ అధ్యక్షతన డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రమశిక్షణతో మంచిగా చదివి రాణించాలన్నారు. చెడు అలవాట్లకు బానిస కావద్దన్నారు. ఎస్‌ఐ తారకేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా సారధి గెడ్డ



రెల్లి గడ్డితో నిండిన సారధి గెడ్డ

రాజాం : మండలంలోని మారేడుబాక గ్రామం నుంచి అంతకాపల్లి మీదుగా సంతకవిటి మండలం వరకు ఉన్న సారధి గెడ్డలో రెల్లి గడ్డి బాగా పెరిగి అధ్వానంగా తయారైంది. ఏటా వర్షాకాలంలో ఈ గెడ్డ ఆయకట్టు పంట పొలాలను ముంచెత్తుతుంది. రెల్లి గడ్డిని తొలగించకపోవడం, పూడికతీత పనులు చేయకపోవడంతో సారధి, మొగిలివలస ప్రాంతాల వద్ద నీరు వంతెనల మీదుగా ప్రవహిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి గెడ్డలో పూడికలు తీయాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగుపరచాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మరింత మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ త్రినాధరావు అన్నారు. మండలంలోని కొల్లివలస ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హోం వర్కు పుస్తకాలు, ఉపాధ్యాయుల లెసన్ ప్లానింగ్, మరుగు దొడ్లు, మధ్యాహ్న భోజన పథకం వంటలు పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, చేతిరాత, హోం వర్కు పుస్తకాలు దిద్దడం సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

గాన గాంధర్వుడికి ఘన నివాళి

రాజాం సిటీ: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్ అన్నారు. బుధవారం ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యంలో బాలసుబ్రహ్మణ్యం నాలుగవ వర్ధంతిని పురష్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహశీలి, మృదు స్వభావి బాలు అని అన్నారు. ఎంతో మందిని తీర్చిదిద్ది చివరి నిమిషం వరకు తన గానామృతాన్ని ప్రజలకు అందించిన మహానుభావుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగీత కళాశాల నిర్వాహకులు మంతపూడి ప్రసాద్, మానవతా సంస్థ అధ్యక్షుడు బీవీ అచ్యుత్‌కుమార్, యాదవ్, ఎస్.సత్యనారాయణ, పెంకి చైతన్యకుమార్, గట్టి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అంగన్‌వాడీ ప్రీస్కూల్ పిల్లల ప్రదర్శన

తెర్లాం: మండలంలోని నందబలగ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో చేపట్టిన ఫ్యాషన్ షో, రంగవల్లుల పోటీలు, చిత్రలేఖనం పోటీలు చూపరులను ఆకట్టుకున్నాయి. గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలతో ఫ్యాషన్ షోను ఏర్పాటు చేశారు. పాఠశాలలో చదువుతున్న కిశోర్ బాలికలకు చిత్రలేఖనం, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిండుకున్న ఇసుక



బొబ్బిలి గ్రోత్‌సెంటర్ ఇసుక స్టాక్ పాయింట్‌లో నిండుకున్న ఇసుక

- రీచ్‌లు తెరవని సర్కారు
- ఇళ్ల నిర్మాణం భారం



ఇతని పేరు జి.సూరిబాబు. విశాఖ జిల్లా తగరపువలస ప్రాంతానికి చెందిన వ్యక్తి. తమ ప్రాంతంలోని ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్న వారి కోసం ఇసుకను తీసుకెళ్లేందుకు ఈ నెల 23న ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నాడు. అక్కడి ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన 20 టన్నుల ఇసుక కోసం 81.29 కిలోమీటర్లకు జీఎస్టీతో కలిపి రూ.11,540లు చెల్లించాడు. కానీ నేటికీ ఇసుక ఇవ్వలేదు. ఏమంటే మీకు స్లాట్ బుక్ అవ్వలేదంటున్నారు. ఎక్కడ బుక్ చేసుకున్నారో, ఎక్కడ లోడ్ చేయాలి? ఎక్కడకు అన్న వివరాలు ఆన్‌లైన్ రశీదులో ఉన్నా సరే ఇతనికి స్లాట్ కేటాయించలేదు.

బొబ్బిలి:

ఇసుక కోసం రోజుకు కనీసం పది మంది వరకూ ఇబ్బందులు పడుతున్నారు. రెండు జిల్లాల పరిధిలో డెంకాడ, కొత్తవలస ప్రాంతాల్లో ఇసుక నెలరోజుల కిందటే నిండుకుంది. ఇప్పుడు జిల్లాలో పిడికెడు ఇసుక కూడా లేదు. ఇన్నాళ్లూ బొబ్బిలిలో ఉందని రెండు జిల్లాలతో పాటు విశాఖ జిల్లా ప్రజలు కూడా బొబ్బిలి నుంచే ఇసుకను తరలించేవారు. ఇప్పుడు బొబ్బిలిలో ఉన్న ఇసుక కూడా



స్లాట్ నమోదు కాని ఏపీ ఇసుక పోర్టల్‌లో బుక్ చేసిన రశీదు

అయిపోయింది. కేవలం మట్టితో కూడిన ఇసుక మాత్రమే ఉంది. ఇది గ్రోత్ సెంటర్‌లోని వివిధ కంపెనీల అవసరాలకు తప్ప మరెందుకూ పనికి రాదు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఇసుక నిల్వలు నిండుకున్నాయి. ఉమ్మడి జిల్లాకు సంబంధించి కొత్తవలస, డెంకాడ, బొబ్బిలి ప్రాంతాల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది టన్నుల ఇసుక నిల్వలు ఉంచారు. వాటినే ఇప్పుడు వర్షాకాలంలో వినియోగించారు. రెండు జిల్లాలతో పాటు, జిల్లాలో జరుగుతున్న రైల్వే మూడవ లైను, జాతీయ రహదారుల నిర్మాణాల్లో వినియోగించారు. వీటితో పాటు విశాఖ జిల్లాకు కూడా ఇసుకను తరలించారు. ఇప్పుడు కొత్తగా కొలువు దీరిన ప్రభుత్వం ఇసుక నిల్వలు చేయడం లేదు. కొత్త రీచ్‌లను తెరవడం లేదు. జిల్లాలోని నదుల్లో అపారమయిన ఇసుక నిల్వలున్నా అనుమతులు ఇవ్వడం లేదు. ఒక వేళ ప్రజలు తమ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను నాటుబళ్లు, ట్రాక్టర్లతో తరలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 60కి పైగా ఇసుక నిల్వలున్న రీచ్‌లున్నాయి. కానీ వేటికీ ఇంకా అనుమతులు ఇవ్వలేదు. ఓ వైపు ఇసుక లేక మరోవైపు వంగర నుంచి తెప్పిస్తామన్న ఇసుకను తేకపోవడం వలన జిల్లాలోని ఇళ్ల నిర్మాణాలకు ఆటంకం కలుగుతోంది. చాలా చోట్ల ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇసుక కోసం నదుల్లో తీసుకువచ్చే వారిని కాపు కాచి మరీ కేసులు నమోదు చేస్తున్నారు. బొబ్బిలిలో సోమవారం రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. టీడీపీకి చెందిన నాయకులు కమిటీలుగా ఏర్పడి ఇసుక వేలం పాట పాడుకుంటున్న చోట్ల ఈ కేసుల నమోదు లేదు. తమ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి వెంటనే ఇసుక రీచ్‌లను తెరిపించాలని, లేదా ఇసుకను ఇతర ప్రాంతాల నుంచి స్టాక్ పాయింట్లకు తరలించే ఏర్పాటు చేయాలని నిర్మాణదారులు కోరుతున్నారు.

అందుబాటులోకి తెస్తాం..

వంగర నుంచి ఇసుక లోడ్లు శుక్రవారం నుంచి ఇక్కడకు వచ్చి డంప్ చేస్తారు. అంతవరకూ ఇక్కడున్న ఇసుక సరిపోతుంది. జేసీ సూచనలతో వంగర ఇసుకను అందుబాటులోకి తెస్తాం.

– ఎం.శ్రీను, తహసీల్దార్, బొబ్బిలి

నిర్వాసితులకు నష్టం లేకుండా పరిహారం

- ఆర్డీఓ సాయిశ్రీ

రామభద్రపురం: ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు నష్టం లేకుండా పరిహారం ప్రభుత్వం అందజేస్తుందని ఆర్డీఓ సాయిశ్రీ అన్నారు. రహదారి విస్తరణలో భాగంగా రహదారి భద్రత నిబంధనల ప్రకారం మండలంలోని తారాపురం గ్రామానికి చెందిన సుమారు 150 ఇళ్లు తొలగించాల్సి ఉంది. అయితే ఆయా ఇంటి యజమానులతో పలుమార్లు రెవెన్యూ అధికారులు సమావేశం ఏర్పాటు చేసి నష్ట పరిహారం ఎంతెంత వస్తుందో తెలిపారు. అప్పట్లో వారు ప్రభుత్వం చెల్లిస్తున్న పరిహారం చాలదని, ఎక్కువ కావాలని డిమాండు చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ సులోచనరాణితో కలిసి బుధవారం ఆర్డీఓ నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ



తారాపురంలో నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిశ్రీ

నిబంధనల ప్రకారం తొలగిస్తున్న ఇంటి విలువల బట్టి ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందన్నారు. పరిహారం అధికంగా డిమాండు చేస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిర్వాసితుల డిమాండు వివరిస్తానని తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

- డిప్యూటీ ఈఓ మోహనరావు

రామభద్రపురం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యమని డిప్యూటీ ఈఓ కె.మోహనరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఎంఈఓ తిరుమలప్రసాద్, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.నాగభూషణరావుతో కలిసి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ పరీక్షలో సుమారు 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో హేతువాద దృక్పథం పెంపొందించుకోవాలన్నారు. ఈ పోటీలలో ప్రతిభ సాధించిన



చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న డిప్యూటీ ఈఓ

వారు జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.మురళీధరరావు, కె.విజయగౌరి, కె.దాలినాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు, సంస్థలు రెన్యువల్ చేసుకోవాలి

రాజాం : ప్రైవేటు దుకాణాలు, సంస్థలను తక్షణమే యజమానులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ ఉన్న వారు రెన్యువల్ చేయించుకోవాలని రాజాం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు అన్నారు. రాజాం పట్టణంలో పలు దుకాణాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. షాపుల యజమానులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, జి.సిగడాం మండలాల్లో పలు దుకాణాలు, సంస్థలను పరిశీలించినట్టు తెలిపారు. ఆయా సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు ఒకొక్కరికి ఏడాదికి రూ.100లు నగదు కార్మిక సంక్షేమ నిధికి చెల్లిం



మెడికల్ షాపులో సూచనలిస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్

చాలని యజమానులకు సూచించినట్టు తెలిపారు.

ఎండీఎం నిర్వాహకులపై రాజకీయ కక్ష

రేగిడి : మండలంలోని దేవుదళ గ్రామంలో టీడీపీ కార్యకర్తలు రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. ఆ గ్రామంలో జెడ్పీ హైస్కూల్‌లో గత 15 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకాన్ని కెంబూరు రచీదేవీ, పొట్నూరు లక్ష్మి తమ సంఘాల ద్వారా వంట చేస్తూ నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు తమకు అనుకూలంగా ఉన్న వారికి ఏదో ఒకటి ఇవ్వాలనే ఆలోచనతో గతంలో ఎండీఎం నిర్వహణలో ఉన్నవారిని తప్పిస్తున్నారు. ఇందులో భాగంగా రచీదేవీ, లక్ష్మీలను తొలగించి, వీరి స్థానంలో టీడీపీ కార్యకర్తలు తమ వర్గీయులను వేసుకున్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. తమకు



విలేకరుల ముందు ఆవేదన వ్యక్తం చేస్తున్న రచీదేవి

ఎటువంటి రాజకీయ వ్యవహారాలు లేకపోయినా తమను తొలగించడంపై మండిపడుతున్నారు. 2009 నుంచి పాఠశాలలో ఎండీఎం నిర్వాహకులుగా ఉన్న తమపై కక్ష సాధింపు తగదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బలవంతంగా తమతో సంతకాలు చేయించేందుకు ఇబ్బందులు పెడుతున్నారని, తొలగింపునకు గురైన రచీదేవీ బుధవారం విలేకరులకు తెలిపారు. తమను అన్యాయంగా తొలగించవద్దంటూ అధికారులను వేడుకున్నారు. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ శ్యామలాకుమారి వద్ద ప్రస్తావించగా గ్రామస్తుల సూచనలు మేరకు ఎండీఎం నిర్వహణ జరగాలని సూచించారని, దీంతో వీరిని తొలగించాల్సి వచ్చిందని వెల్లడించారు.

బెల్టుషాపు నిర్వాహకుల అరెస్టుకు డిమాండ్

బొబ్బిలి రూరల్: మండలంలోని వెంకటరాయుడుపేట గ్రామంలో విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపుల విక్రయాలు జరిపి ప్రజల ఆరోగ్యాన్ని చిన్నాభిన్నం చేస్తున్నారని వెంటనే అధికారులు బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం శాఖా కార్యదర్శి బి.రమణమ్మ, జిల్లా నాయకుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో ఆ పార్టీ మహాసభను నిర్వహించారు. బాధిత మహిళలతో ఆందోళన చేపట్టారు. మద్యం విక్రయిస్తున్న వారిని అరెస్టు చేయాలంటూ గ్రామ సభలో తీర్మానం చేశారు. గ్రామంలోని ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్.గోపాలం, శకుంతల, కళావతి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీపీఎం శ్రేణులు

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆరికతోట విద్యార్థులు

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 24న పారాదిలో నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో అండర్ 14 విభాగంలో ఎ.శ్యాంమోహన్, అల్లు మధు, అండర్ 17 విభాగంలో ఎం.జ్యోతిప్రకాష్, వర్రి ధనలక్ష్మి, తామాడ తేజేశ్వరి, పిరిడి జయశ్రీ, అడపా భువనేశ్వరి ప్రతిభ సాధించారని వ్యాయామ ఉపాధ్యాయులు వి.అప్పలనాయుడు తెలిపారు. వీరంతా అనంతపురం, తిరుపతి, నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం జి.చంద్రశేఖర్ శర్మతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

సాగునీటి కాలువల్లో పూడికలు తొలగించండి

సంతకవిటి: మద్దువలస కాలువ ద్వారా సాగునీరు వచ్చే విధంగా కాలువల్లో పూడికలు తొలగించే చర్యలు చేపట్టాలని రాజాం వ్యవసాయ శాఖ సంచాలకులు కొల్లు చంద్రరావు ఇరిగేషన్ డీఈ ఈశ్వరప్రసాద్, జేఈ రవీంద్రకు సూచించారు. పూడికల తొలగింపు ద్వారా శివారు గ్రామాలైన సిరిపురం, జీఎస్ పురం, మంతిన, శేషాద్రిపురం, బూరాడపేట, అప్పలఅగ్రహారం, శివాకులపేట తదితర గ్రామాల రైతుల పొలాలకు సాగునీరు అందేలా చూడాలని కోరారు. మండలంలోని జీఎస్ పురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏడీ, వ్యవసాయాధికారి పైల నవీన్‌లు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ మద్దువలస కాలువ పరిస్థితిపై



రైతులకు సూచనలిస్తున్న ఏడీ చంద్రరావు

కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని రైతులకు తెలిపారు. లాభసాటి వ్యవసాయంపై ఏఓ నవీన్ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఈశ్వరరావు, వీఏఏ గురుగుబెల్లి విద్యాసాగర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పి.వెంకటరమణ, అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

పోషకాహాలతోనే ఆరోగ్యం

బొబ్బిలి రూరల్: గర్భిణులు, బాలింతలు పోషకాలు కలిగిన చిరుధాన్యాలను ఆహారంలో తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించవచ్చని ఎంపీడీఓ పి.రవికుమార్ అన్నారు. మండలంలోని మెట్టవలస గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పోషకాహారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యవంతమైన పిల్లలు కావాలంటే పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గ్రామంలో పోషకారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు.

‘పొలం పిలుస్తోంది’లో సాగుపై అవగాహన



రాజాం సిటీ: జీసీపల్లిలో పొలం పిలుస్తోందిలో పాల్గొన్న రైతులు



వంగర: శివ్వాంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు రైతులను చైతన్యపరుస్తున్నారు. పంటలో వచ్చే తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. పంట దిగుబడుల హెచ్చింపునకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలిస్తున్నారు. బుధవారం పలుచోట్ల పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



బాడంగి: ముగడలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ శిరీష, సిబ్బంది



తెర్లాం:పెరుమాళిలో వరి పంటను ఆశించే తెగుళ్లపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సునీల్‌కుమార్



రేగిడి : కందిశలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ మురళీకృష్ణ



బొబ్బిలి రూరల్: డ్రోన్ ద్వారా మందుల పిచికారీని వివరిస్తున్న ఏడీ శ్యాంసుందర్

పారాది కాజ్‌వేపై వరదనీరు

- నిలిచిన రాకపోకలు, ట్రాఫిక్ ఇబ్బందులు



భారీగా నిలిచిపోయిన వాహనాలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద ఉన్న కాజ్‌వే పైనుంచి వరదనీరు పారుతోంది. ఎగువ ప్రాంతాలైన ఒడిశా రాష్ట్రంలో వర్షాలు కురవడంతో వస్తున్న వరదలకు వేగావతి నది పొంగి ప్రవహిస్తోంది. ఫలితంగా కాజ్‌వే పైనుంచి వరదనీరు పారుతుండడంతో రామభద్రపురం – బొబ్బిలి మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఈ సమస్య నెలకొనడంతో పారాది బ్రిడ్జి వద్ద పెద్ద ఎత్తున వాహనాల నిలిచిపోగా తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంది. బ్రిడ్జికు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సతీష్‌కుమార్‌లు అక్కడకు చేరుకున్నారు. వరద ఉధృతిని పరిశీలించారు. డీఎస్పీ శ్రీనివాసరావు ట్రాఫిక్ కానిస్టేబుల్ అవతారం ఎత్తారు. స్వయంగా ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు చర్యలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం సమయానికి ట్రాఫిక్ క్లియర్ చేశారు.



భారీగా వర్షం కురవడంతో నిండుగా పారుతున్న చప్టా

రామభద్రపురంలో భారీ వర్షం

రామభద్రపురం: మండలంలోని మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువులు నిండి వాగులు వంకలు పొంగి పారుతున్నాయి. మండలంలోని పలు చెరువులు నీటితో నిండి కళకళలాడుతున్నాయి. కొద్ది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు సాగునీటి కష్టాలలో పడ్డారు. కురిసిన భారీ వర్షంతో వరి నాట్లు వేసిన రైతన్నలకు నీటి కష్టాలు కొంతమేరకు గట్టెక్కాయి. మండలంలోని రైతులు అధికంగా ఆధారపడే కూరగాయల పంటలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్న సమయంలో వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం అంతా ఇంతా కాదు. కూరగాయల సాగుకు మాత్రం ఈ వర్షం బాగా ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నీట మునిగిన బీర, చిక్కుడు పంట

కషాయాలపై అవగాహన

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో ప్రకృతి ఐసీఆర్‌పీలు పుర్లి లక్షున్నాయుడు, రమణ రైతులకు కషాయాల తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. బుధవారం పంట పొలాల్లో రైతులకు తూటి ఆకులతో కషాయాన్ని చేసి చూపించారు. ఈ కషాయం తయారీ తరువాత పంట పొలాలకు వేసే విధానంపై అవగాహన కల్పించారు. వీటితో రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించడంతో పాటు సుడిదోమ నివారణ చేయవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గౌరునాయుడు, సర్పంచ్ భుజంగరావు పాల్గొన్నారు.

నేడు మందరాడలో గ్రామదర్శిని

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో గురువారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జి.వి.రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులుఅందరూ హాజరుకావాలని కోరారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

రేగిడి : మండలంలోని మునకలవలస, కొర్లవలస, బాలకవివలస గ్రామాల్లో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈఓపీఆర్‌డీఓ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. కాలువల్లో పూడికలు తొలగించి, సంపద తయారీ కేంద్రాలకు తరలించారు.